క్లుప్తంగా

17 వ వార్డులో మున్సిపల్ కమిషనర్ పర్యటన



నందిగామ: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందుతున్న సేవలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు, ప్రజల వద్ద నుంచి సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిరోజు వార్డు పర్యటన చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం అన్నారు. పట్టణంలోని 17 వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



భీమవరం(వత్సవాయి): ఎంపీయూపీఎస్ పాఠశాలలో గత ఐదేళ్లుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సహచర ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. హెచ్‌ఎం థాంసమ్మ, ఉపాధ్యాయులు ఎస్‌కే షబీమా, సుల్తానాబేగం ఐదేళ్లగా ఇదే పాఠశాలలో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని సర్పంచ్ భీమాల సుజాత తెలిపారు. వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాజేశ్వరి, ఎంపీటీసీ చెన్నమ్మ, హెచ్‌ఎం అజ్మీరు కొండ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ రుణాలు అందజేత



నందిగామ: రైతులకు సహాయ సహకారాలు అందించేందుకే వ్యవసాయ రుణాలు అందజేస్తున్నామని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని కొణతమాత్మకూరు వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 14 మంది రైతులకు రూ.53 లక్షల రుణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు వ్యవసాయాన్ని పండుగగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి రైతు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏటిపట్టు గ్రామాల పార్టీ నాయకులు లగడపాటి వీరయ్య, కనగాల వెంకటేశ్వరరావు, నాని, ఉమా తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో ఘనంగా ధోని జన్మదిన వేడుకలు



నందిగామటౌన్: మహేంద్ర సింగ్ ధోని భారత క్రికెట్ జట్టుకు అందించిన సేవలు మరువలేనివని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో శుక్రవారం ధోని జన్మదిన వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అరుణకుమార్ క్రికెట్ మైదానంలో పిచ్, వికెట్లు బ్యాట్, ధోని బొమ్మలతో ఉన్న 20 కేజీల కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ధోని సారథ్యంలో భారత క్రికెట్ జట్టు అద్భుత విజయాలు నమోదు చేయటమే కాకుండా వరల్డ్ కప్, టీ20 వరల్డ్ కప్‌లను సైతం సాధించిందని గుర్తు చేశారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని యువత ధోనిని ఆదర్శంగా తీసుకుని తాము ఎంచుకున్న రంగంలో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ధోనీ అభిమానులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

నందిగామ: న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఈ వృత్తిలో కొనసాగడం అదృష్టంగా భావించాలని నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ ,బీసీ, మైనార్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నంద్రు బాబు విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని రహదారి బంగళాలో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ న్యాయవాదుల సమావేశం జరిగింది. సమావేశంలో సంఘ సంక్షేమం, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల పట్టాలు, న్యాయవాదుల క్రమశిక్షణకు సంబంధించి, పలు అంశాలపై చర్చించారు. అనంతరం న్యాయవాదులు నంద్రు శ్రీరామ్మూర్తి, మట్ట ప్రసాద్, దర్శి అర్జున్, బొబ్బిళ్ళ పాటి భాస్కరరావు, ఎక్కిరాల హనుమంతరావు, పి.ప్రకాష్, రాధాకృష్ణ, దుర్గా, ఆజాద్‌లను సత్కరించారు.

భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలపై పంచాయతీ రాజ్ అధికారులు, నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా భవన నిర్మాణాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా నాలుగు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఇప్పటికే 60 శాతం మేర భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా ఆగస్టు 15లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పనులను అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, మలక్ బషీర్, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ అక్కినేని వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భవన నిర్మాణాల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పట్టణాలకు దీటుగా గ్రామాల్లో అభివృద్ధి

- చింతలపాడులో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్(చందర్లపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలోని చింతలపాడు గ్రామంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.20 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం, రూ.15 లక్షలతో ముస్లిం శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీ ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని జగన్‌మోహనరావు తెలిపారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించటంతో పాటు గ్రామీణ ప్రాంతాలను సైతం పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సీసీ రోడ్లు, డ్రైన్‌లతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు.

నిధులు మంజూరు చేసిన ఎంపీకి కృతజ్ఞతలు

గ్రామంలో కమ్యూనిటీ హాల్, శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విజయవాడ ఎంపీ కేశినేని నానికి ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జానీ, నాయకులు కందుల నాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, రాయల జానకిరామయ్య, నంద్రు శ్రీరామ్మూర్తి, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

11న పేటకు మంత్రి విడదల రజని రాక

ప్రభుత్వాస్పత్రి అదనపు భవనాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ప్రారంభోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈనెల 11 వ తేదీన జగ్గయ్యపేట పట్టణానికి రానున్నారు. సుమారు రూ.3 కోట్ల నిధులతో నిర్మించిన ప్రభుత్వాస్పత్రి అదనపు భవనాలు, పట్టణంలోని రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాట్లను పరిశీలించారు. సభావేదిక స్థలం ఎంపిక తదితర అంశాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.3 కోట్ల నాబార్డు నిధులతో పురాతన ఆస్పత్రికి అదనపు భవనాల నిర్మాణంతో పాటు 30 పడకల నుంచి 50 పడకలకు పెంచామన్నారు. వైద్య సిబ్బందిని కూడా అదనంగా నియమించి,ఆధునిక సాంకేతిక వసతి సౌకర్యాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. తొర్రగుంటపాలెంలో ఆ ప్రాంత ప్రజల సౌకర్యార్థం రూ.90 లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్, బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీలో నిర్మించిన మరొక అర్బన్ హెల్త్ సెంటర్‌ను కూడా ప్రారంభిస్తారని తెలిపారు.



పేటలోని ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో లక్ష్మీభార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తక్కెళ్లపాడు-3 కేంద్రానికి ఓసీ కార్యకర్త, సహాయకులుగా అన్నవరం-1 ఎస్సీ, బూదవాడ-2 బీసీ(డీ), జగ్గయ్యపేట పట్టణంలోని 20వార్డు-2 ఓసీ, వత్సవాయి మండలం లింగాల-1 ఎస్సీ ఖాళీల భర్తీకి ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

భీమవరం(వత్సవాయి):మండలంలోని మవరం గ్రామానికి చెందిన యువకుడు నుంచి రెండు కేజీల గంజాయిని విజయవాడ సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాల మేరకు గ్రామానికి చెందిన యువకుడు జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో సెబ్ అధికారులు అతన్ని అదుపులోనికి తీసుకుని విచారించగా అతని వద్ద నుంచి రెండు కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం నలుగురు వ్యక్తులు అదుపులో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విషయంపై వత్సవాయి ఎస్‌ఐ బి.అభిమన్యుని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని చెప్పారు.

సంక్షేమంలో దేశంలోనే ఏపీ అగ్రస్థానం

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కొణతాలపల్లి(వీరులపాడు): ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకుని సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన అందించటంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో సంపూర్ణ మద్దతు పలకాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొణతాలపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

పొన్నవరం(వీరులపాడు): గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన సమాచారం మేరకు మండలంలోని పొన్నవరం గ్రామానికి చెందిన ఈదర కృష్ణనాగేశ్వరరావు, అతని స్నేహితుడు చిట్టారెడ్డి వంశీ గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారం రావటంతో సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో కూడా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారని చెప్పారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవిత్ర పుణ్యక్షేత్రంలో శరవేగంగా అభివృద్ధి



నిర్మాణంలో ఉన్న పార్క్



పూర్తి కావస్తున్న సచివాలయ భవనం

ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్న ఉద్యానవనం

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారు వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం పెనుగంచిప్రోలులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారుగా రూ.50 లక్షలకు పైగా నిధులతో చెరువు కట్ట వద్ద పార్క్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే చుట్టూ ఫెన్సింగ్, గోడలు, ఊయల, జారుడు బల్లలు వంటివి ఏర్పాటు చేశారు. చుట్టూ వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, ఫౌంటెన్‌తో పాటు గ్రామస్తులు సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. విజయవాడ, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు ఇక్కడకు వస్తుంటారు. వీరందరిని ఆకట్టుకునే విధంగా ఈ ఉద్యానవనాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పెనుగంచిప్రోలు గ్రామ వాసుల కల నెరవేరనుంది. సుబ్బాయిగూడెం రోడ్డులో డంపింగ్ యార్డు నిర్వహణ ఇప్పటికే పలువురి ప్రశంసలు అందుకుంది. ఇప్పటివరకు తూర్పు బజారున ఎక్కువగా ఎస్సీ, బీసీలు నివసించే ఏరియాలో ప్రభుత్వ భవనం ఒక్కటి కూడా లేదు. ప్రస్తుతం రూ.45 లక్షల నిధులతో గ్రామ సచివాలయం-2 భవనం నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. దీనికి తోడు జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలో సుమారు రూ.4 కోట్లతో తాగునీటి పైపులైన్ నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నిధులు మంజూరయ్యాయి. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు సమకూరుతున్నాయి.

అభిలషణీయ మండలంగా పెనుగంచిప్రోలు



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సహకారంతో మండలంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కొత్తగా అభిలషణీయ బ్లాక్ పథకం(ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం)లో భాగంగా మండలాన్ని ఎంపిక చేయటం చాలా ఆనందంగా ఉంది. దీంతో మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, సమ్మిళిత వృద్ధిపై దృష్టి సారించటంతో పుణ్యక్షేత్రంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

– వేల్పుల పద్మకుమారి, సర్పంచ్

తొర్రగుంటపాలెంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

జగ్గయ్యపేటఅర్బన్: ఇప్పటివరకు చిల్లకల్లు గ్రామ పంచాయతీలో ఉండి, ఏడాది క్రితం జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలోకి వచ్చిన 8 వ వార్డు తొర్రగుంటపాలెంను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ధ్యేయంగా ముందుకు పోతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. తొర్రగుంటపాలెంలో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజ్ నిర్మాణ పనులను శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్‌తో కలసి మున్సిపల్ చైర్మన్ పరిశీలించారు. ఊర చెరువు అభివృద్ధి పనులు, చెరువు బజారులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వారు పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరమైన చోట్ల రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పర్యాటక కేంద్రంగా ఊర చెరువును అభివృద్ధి చేస్తున్నామన్నారు. వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధిలో బాగా వెనుకబడిపోయిన తొర్రగుంటపాలెంలో తాగునీటి కోసం కుళాయిలతో పాటు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేసి తక్కువ ధరకే మినరల్ వాటర్ అందజేస్తున్నట్లు తెలిపారు. అన్ని వీధుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ స్తంభాలు, నూతన విద్యుత్ లైన్లు, వీధి లైట్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ, నాయకులు తన్నీరు నాగేంద్ర, బొల్లా శ్రీనివాస్, పాటి సాంబ, కాసర్ల బాలస్వామి పాల్గొన్నారు.



చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్ కృష్ణప్రసాద్

యూనిఫాం లేనందుకు సచివాలయ కార్యదర్శులకు షోకాజ్

జగ్గయ్యపేటఅర్బన్: యూనిఫాం లేకుండా విధులకు హాజరైన నలుగురు సచివాలయ కార్యదర్శులకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గమల్లేశ్వరరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 4,12 సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. 12 వ సచివాలయానికి చెందిన నలుగురు కార్యదర్శులు యూనిఫాం లేకుండా విధులకు హాజరైనందుకు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా కార్యాలయం మేనేజర్‌ను ఆదేశించారు. వలంటీరు ఒకరు విధులకు గైర్హాజరు కావడంతో అతన్ని విధుల నుంచి నిలుపుదల చేయాల్సిందిగా ఆదేశించారు. 4, 12 సచివాలయాల్లో 11 వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం జరగనున్నందున నోడల్ అధికారులు, సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు పలు టోకెన్ రిజిస్ట్రేషన్, సర్వీస్ రిక్వెస్ట్‌లు వేగవంతం చేయాలంటూ పలు సూచనలు, సలహాలు జారీ చేశారు.

ఆధ్యాత్మికవేత్త టీఎల్‌ఎన్ ఆచార్యులు మృతి

జగ్గయ్యపేట అర్బన్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, భగవద్రామానుజ గోష్ఠి వ్యవస్థాపకుడు, ఎస్‌జీఎస్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ తట్టా లక్ష్మీనరసింహాచార్యులు(టీఎల్‌ఎన్ ఆచార్యులు)(78) శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీఎల్‌ఎన్ ఆచార్యులు జగ్గయ్యపేట ప్రాంతంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతూ పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని, వారి మృతి బాధాకరం అని అన్నారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్న ఉదయభాను ఆయన భౌతికకాయానికి గజమాల వేసి నివాళులర్పించారు.

రామాలయంలో ఘనంగా శాకంబరి ఉత్సవాలు

నందిగామ: స్థానిక కూరగాయల మార్కెట్ బజారులో ఉన్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా కూరగాయల వర్తక వ్యాపారులు శాకంబరి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయంలోని సీతారాముల వారితో పాటు పరివార దేవతలను వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న సురక్ష క్యాంపులతో విలువైన సేవలు

సర్టిఫికెట్‌లు అందజేసిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్(చందర్లపాడు): జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు ఎంతో విలువైన సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలోని పొక్కునూరు, చింతలపాడు గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్‌లు ఇంటికి వచ్చి ఏ సర్టిఫికెట్ కావాలని అడిగి మరీ తెచ్చి అందిస్తుంటే ప్రజల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయన్నారు. ఇంటింటికీ వచ్చి ఏం కావాలో తెలుసుకుని సేవలందించటం గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలాదేవి, నాయకులు కొమ్మినేని మహేంద్ర, వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, కటుకూరి వెంకటరత్నం, షేక్ జానీ, నందిగామ శ్రీను, శ్రీరామ్మూర్తి, చిన్న జానీ, పలువురు అధికారులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.



చింతలపాడు జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నిబంధనలు పాటించని 15 మంది వాహనదారులకు జరిమానా

కంచికచర్ల: వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని లేకపోతే కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని ఎస్‌ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక జుజ్జూరు రోడ్డు, నేషనల్ హైవేపై శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ, మైనర్లకు యజమానులు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఒకవేళ ఇస్తే ప్రమాదవశాత్తు ఏదేని ప్రమాదం జరిగితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదని, ముఖ్యంగా మద్యం తాగి వాహనాలు నడపరాదని లేకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవలసి వస్తుందని అన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా వాహనాలను నడుపుతున్న 15 మంది వాహనదారులకు రూ.1,850 జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రౌండ్ టేబుల్ సమావేశం వాల్ పోస్టర్ విడుదల

జగ్గయ్యపేటఅర్బన్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9 వ తేదీన విజయవాడ హనుమాన్ పేటలో మారుతీ ఫంక్షన్ హాల్‌లో జరిగే బీసీ రౌండ్ టేబుల్ సమావేశం వాల్ పోస్టర్లను బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, పార్టీ పేట నియోజకవర్గం ఇన్‌చార్జి కొదమల ప్రభుదాసుతో కలసి వారి గృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్నెపాక పవన్ కార్తీక్, కన్వీనర్ కేవీ రత్నం, పట్టణ అధ్యక్షుడు షేక్ బాషా, నాయకులు రాజశేఖర్, రమణ, హెప్సిబా, పండు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని దుర్గానగర్‌లో గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం నేపథ్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చనలు జరిగాయి. పట్టణానికి చెందిన వెంకట్రావు దంపతులు ఆలయానికి కనకదుర్గ అమ్మవారి ఉత్సవమూర్తిని బహూకరించారు.ఆ విగ్రహానికి సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం పలు రకాల పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.